## పెళ్లంటే...?

రాత్రి తొమ్మిదిన్నర దాటింది. జలజకి కంగారుగా ఉంది. మెడికల్ షాపుకని ఏడు గంటలకి బైల్దేరి వెళ్లిన సుధాకర్ ఇంకా రాలేదు. షాపుకెళ్లి రావటానికి పది నిమిషాలు కూడా పట్టదు. సెల్‌ఫోను కూడా పట్టుకెళ్లలేదు.

టైముతోబాటు జలజకి టెన్షనూ కూడా పెరుగుతోంది. ఫ్లాట్స్‌లో ఎవర్నైనా పిలిచి సాయం అడుగుదామన్నా ఆ ఫ్లోర్‌లో ఉన్న మిగిలిన మూడు వాటాల తాళాలూ వేసి ఉన్నాయి.

తనకీ ఈ ఊరు కొత్తే. ఒక్కత్తీ తలుపు తెరచి ఉండాలంటే భయం వేస్తోంది. తలుపువేసి లోపల ఉండాలన్నా మరింత భయం వేస్తోంది.

జలజకి మొన్న శ్రావణమాసంలోనే పెళ్లయింది. పదిహేను రోజులపాటు తిరుపతి, బెంగుళూరు గట్రా తిరిగి వచ్చేసరికి ఆ నెల్లోనే కాపురం పెట్టాలని పెద్దలు ఈ అపార్ట్‌మెంట్‌లో... వాళ్లని వంటరిగా కాదు... జంటగా వదిలిపెట్టి రెండ్రోజులు సందడి చేసి వెళ్లిపోయారు. సుధాకర్ ఇంట్లో ఉన్నంతసేపూ బోల్డంత సరదా కబుర్లూ చెప్పలేనన్ని సరసాలూ... ఒక్క క్షణం ఉన్న చోట ఉండదు ఉండనీయడు. అతను డ్యూటీకెళ్లాక కూడా మనసునిండా మెదడునిండా ఉండి స్వీటెస్ట్ మెమరీల్తో మైమరపిస్తాడు. గంటకోసారి ఫోను చేసి అల్లరి చేస్తూంటాడు.

తొమ్మిదిన్నరకి బాక్స్ రడీ చేసి బలవంతంగా గెంటితే గుణుస్తూ ఆఫీసుకెళ్తాడు. ఒక్కోసారి పర్మిషన్తో ఇంటికొచ్చేస్తాడు. మామూలుగా ఆఫీసు అయిపోయిన అరగంటలోపు ఇంట్లో ఉంటాడు. ఇవ్వాళ... 'హాయ్ డార్జిలింగ్... సిమ్లా.. ఊటీ..' అని కోడ్ భాషల్తో అరుస్తూ వచ్చాడుగానీ తనంత ఏక్టివ్‌గా రెస్పాండవలేదు. మధ్యాహ్నం నుంచీ కడుపులో మెలిపెట్టినట్లు నొప్పి... నవ్వు నటించినా తనలో తేడా పసిగట్టేశాడు సుధాకర్! 'డాక్టర్ దగ్గరకి వెళ్దాం' అని హడావుడి పడిపోయాడు.

"వద్దులెండి నాకిది మామూలే" అంటూ తను ప్రతీనెలా వాడే టేబ్లెట్స్ తెమ్మంది! 'జీ హుజూర్ క్షణంలో వస్తాను' అంటూ పరిగెట్టుకుని వెళ్లాడు.

క్షణాలు గంటలుగా దొర్లిపోతున్నాయి. గడియారంలో సెకన్ చప్పుళ్లూ

గుండె చప్పుళ్లు కూడా ఠాప్... ఠాప్... మని చెవుల్లో మార్మోగుతున్నాయి.

ముప్పయ్యోసారి టైము చూసింది. పదిదాకా– డేకాయ్.. గడియారం ముళ్లు–

చిన్నప్పుడు అన్నయ్యో నాన్నో ఇంటికి రావటం లేటయితే అమ్మ కంగారుపడుతూ మెట్లమీద కూచుని ఎదురుచూస్తుంటే... 'ఓవర్ యాక్షన్ ఆప'మని జోకులేసే వాళ్లం. ఇప్పుడు ఎదురుచూడ్డం ఎంత కష్టమో అర్థం అవుతోంది. కళ్ల నీళ్లు పొంగుతున్నాయి. రెండుసార్లు అత్తగారింటికో అమ్మగారింటికో ఫోనుచేయాలని ప్రయత్నం చేసింది.

కానీ వాళ్లని కూడా ఈ రాత్రివేళ కల్లోలపరచడం ఎందుకని మానేసింది. పైగా సుధాకర్ ఏమంటాడో అని ఆగిపోయింది.

ఏ స్కూటర్ చప్పుడైనా ఆశగా తలుపు తీసి చూస్తోంది! లోపలికొస్తోంది.

✦ ✦ ✦

"అరె సుధా... ఏదో బజార్లో కనిపించావు కదాని కాజువల్‌గా రూమ్‌కి రారా అన్నాను. నువ్ వస్తావని ఊహించలేదు.

"రావాలనుకోలేదా"

"రావాలనుకున్నాను. రావేమో– అనుకున్నాను! పెళ్లయ్యాక నువ్ మన టీమ్‌ని కట్ చేస్తావని శశిగాడు అరడజను బీర్లు పందెం కాశాడు"

"ఓడిపోయాడు ఆ వెధవని రమ్మనాల్సింది"

"వద్దులే కొత్తగా పెళ్లయిన వాళ్లు కనిపిస్తే వాడు సిగ్గులేని ప్రశ్నల దిట్టా విప్పుతాడు. జవాబు చెప్పలేక నువ్వూ, వినలేక నేనూ ఛావాలి!"

"అవున్లే ఆ మాట రైటే!"

"వాడికి పెళ్లయితే ఆఫీసు పక్కనే రూమ్ తీసుకుంటాడుట. మధ్య మధ్యలో అలా వెళ్లి ఆవిడగార్ని చూసి పులకించిపోయి వస్తాట్ట"

"ఆఫీసులో అమ్మాయినే పెళ్లాడేస్తే ఇటూ అటూ తిరిగే టైము కలిసి వస్తుంది కదా!"

"సర్లే... వాడి గొడవ ఎందుకు ఇంకోటి ఓపెన్ చెయ్యి"

"ఇంకో బాటిలా? ఇంట్లో అత్తగారూ, ఎక్స్ట్రాలూ లేరా?"

"మొన్నే వెళ్లారు కొత్త కాపురం చిట్కాలూ బోధించి చక్రాలూ బిగించి"

"అయితే ఆ అమ్మాయికి ఒక్కత్తే ఇంట్లో ఉందా"

"ఆ... పగలంతా ఉండట్లేదూ. అలాగే ఉంటుంది. తియ్యి ఇంకో బాటిల ఓపెన్ చెయ్యి"

"ఒరే మాట తడబడుతోంది. కొత్త పెళ్లాం. ఓవరయితే పసిగట్టేసి నసపెట్టేస్తుంది. ఇంక ఆపెయ్"

"నోరు ముయ్యరా రాజూ... అసలు నా కెపాసిటీ ఫోర్ కదా. ఇప్పటికి ఎన్నయ్యాయి జస్ట్ టూ. ఇంకొక్కటి వేసి గుడ్ నైట్ చెప్పేస్తా! టైమెంతయింది.. ఆ- పదింపావు. ఇంకో అరగంట- ఇట్సోకే... నో.. నో.. గ్లాసులో వద్దు బాటిలిచ్చేయ్"

✦ ✦ ✦

'పదీ ఇరవై' దాటింది టైము. 'పదకొండు' అనుకుంటే భయం పెరిగిపోతుంది. టేపు రికార్డర్ ఆన్ చేసింది. చక్కటి పాట ఏదన్నా తోడుండి కంపెనీ ఇస్తుందేమోనని... ఏదో లవ్ డ్యూయెట్టే. పొద్దుట బాగానే ఉంది. ఇప్పుడు ఏదోలా ఉంది.

తలుపు చప్పుడు. ఆయనే.. కాదు ఆయనయితే కాలింగ్ బెల్

కొడతారు. లాక్ చైన్ బిగించి తలుపు కొంచెం తెరిచింది.

సుధాకర్! అమ్మయ్య!! బాధ, కోపం పోయి చైన్ తీసింది.

'హాయ్ డార్లింగ్ అనలేదు. మొహం బాగా అలసినట్లుంది. సోఫాలో కూచున్నాడు.... కాదు కూలబడ్డాడు. భయంగా చూస్తోంది మొగుడి మొహంకేసి. వెనక్కి జార్లపడి సీలింగ్ చూస్తున్నాడు.

"జలజా... ఆ వెధవ పాటలు కట్టెయ్. కట్టి పడెయ్"

'సమ్‌థింగ్ హేపన్డ్' అనుకుంటూ టేప్‌రికార్డర్ దగ్గరకి వెళ్లింది.

"వెరీగుడ్... థేంక్యూ వెరీ మచ్! చాలా హాయిగా ఉంది. చాలా..."

జలజ టేప్ రికార్డర్ బటన్ నొక్కి సుధాకర్ దగ్గరకొచ్చింది.

"చాలా లేటయింది. ఫోనైనా చేయలేదు. నాకెంత భయం వేసిందో ఎక్కడికెళ్ళారో తెలియక!"

"స్వర్గానికి వెళ్లాను. అక్కడ ఫోన్లుండవ్! ఉన్నా చెయ్యను. నీకు భయమేస్తే నేను వణికిపోవాలా? నెవ్వర్?"

"సరేలెండి... భోజనం చేదురుగాని లెండి" కళ్లనీళ్ళుదొర్లుతుండగా అంది జలజ.

"భోజనమా... యూ మీన్ వేపుడు పచ్చడి చారు గాడిద గుడ్డూ... పెరుగూ... ఇవే కదా! ఎగ్ ఫ్రైడ్ రైస్... విజిటబుల్ మంచూరియా... దాని ముందు గ్రీన్ మసాల ఉన్నాయా? ఉండవు ఇది ఇల్లు - అది హెవెన్. బస్... ఆర్యు క్రైయింగ్ - యస్ ఇల్లంటే అంతే. పెళ్ళంటే ఇంతే. హెల్లే! హాయిగా బేచ్‌లర్ లైఫ్‌లో ఎంత ఎంజాయ్‌మెంట్! ఎంత ఖుషీ! ఇంటికి రావక్కర్లేదు ఎవరినైనా ఇంటికి రమ్మనచ్చు. కన్నీళ్లు కంగార్లూ ఉండవ్. ఉంటాయా ఉండవ్. ఎవరూ... ఫోను చెయలేదేం అని నిలెయ్యరు

మన ఇష్టం వచ్చినట్టు ఉంటాం. ఇష్టమైనది తింటాం. నో టెన్షన్. నో హర్రీ– నో సేక్రిఫైజ్! నో కమిట్‌మెంట్. నో సెంటిమెంట్. నో లవ్! ఆ లైఫే లైఫ్! రాజుగాడూ – శశిధరగాడూ వాళ్ళెంత సుఖంగా ఉన్నారు. నేనూ ఉన్నాను... 'మాంగల్య తంథునా నిన్నే...' అంటూ తన్నించేసు కున్నాను– ఇట్సోవర్.. గుడ్‌నైట్.. నువ్వెళ్ళి గదిలో పడుకో. నేను సోఫాలో ఎంజాయ్ చేస్తాను. వద్దులే. నువ్వూ సోఫాలో పడుకో రా!"

జలజ ఏడుస్తూ పడక గదిలోకి వెళ్ళి తలుపు మూసింది. సుధాకర్ కొంతసేపు వాగి పడుకున్నాడు. జలజ ఏడుపు – ఆందోళన – భయం – తనెంత అదృష్టవంతురాలనని అనుకుందో అంత... దురదృష్టవంతురాలు అనిపిస్తోంది. ఆ రాత్రి ఎలా గడుస్తుందో అర్థం కావట్లేదు.

✦ ✦ ✦

"జలజా... ఏంటి ఇంకా పడుకున్నావ్? లేలే! అయ్యో.. వళ్లు కాలిపోతోంది. జ్వరం వచ్చిందా? అర్రెరే... లే– డాక్టర్ దగ్గరికి వెళ్దాం!"

"ఏమక్కర్లేదు"

"ఫ్లాస్క్ తీసుకెళ్లి కాఫీ తెస్తా... నువ్వేం లేవకు"

"నాకక్కర్లేదు" విసురుగా లేచింది.

"తలనొప్పి వళ్లు నొప్పులూ ఉన్నాయా. అసలే గున్యా జ్వరాలు ఉన్నాయి. పేరాసిటమాల్ తెస్తాను!"

"వద్దు నా కోసం మీరేం టెన్షన్ పడకండి. నాకే టాబ్లెట్స్ అక్కర్లేదు" బాత్రూం గడియ మూసేసుకుంది.

సుధాకర్ ఒక్క క్షణం ఉలిక్కిపడి రాత్రి తను తాగి లేట్‌గా రావడం జ్ఞాపకం చేసుకున్నాడు. వేళ్ళు కొరుక్కుని కెవ్వున అరిచాడు. షూస్ ఎప్పుడు విప్పాడు? దిండు ఎవరు వేశారు? దుప్పటి తనే కప్పుకున్నాడా? ఏవన్నా

అతిగా వాగాడా? వామ్టింగ్ అవలేదు గదా? హాల్లోకొచ్చి సోఫా చుట్టుపక్కల చూసాడు...

డైనింగ్ టేబుల్ మీద అన్నం ప్లేట్లు ఓపెన్ చేసిలేవు.

జలజ కూడా అన్నం తినలేదన్నమాట!

'కడుపులో పోటు' టేబ్లెట్స్ తెమ్మంది. మర్చిపోయాడు.

వెధవ... ఆ రాజుగాడు మెడికల్ షాపుకెళ్తూనే కలిశాడు- కొంప ముంచాడు!

జలజ ఫ్రెష్ అయి కాఫీ పెట్టటానికి తయారైంది!

ఆమెతో మాట్లాడటానికి చాలా ట్రై చేశాడు- ఓ 10సార్లు సారీ చెప్పాడు. ఇంకెప్పుడూ ఇలా జరగదని అన్నాడు.

జలజ మౌనం అతన్ని మరింత గిల్టీగా చేస్తోంది.

"మా.. ట్లా... డ... వా?" మొగుళ్లా అరిచాడు.

ఆమె విదిలించుకుంటూ వెళ్లి టేప్ రికార్డరు రివైండ్ చేసి ఆన్ చేసింది!

వింటూన్న సుధాకర్ మొహం కత్తివాటుకి నెత్తురు చుక్కలేదన్నట్లు అయిపోయింది.

భూమి తనచుట్టూ తిరుగుతోంది- దాని చుట్టూ తన తల తిరుగుతోంది.

రెండు చేతుల్తో తల పట్టుకుని సోఫాలో కూచున్నాడు.

తను వాగిన వాగుడు తనకే అసహ్యంగా ఉంది.

తనెంత తాగేడో స్కేనింగ్ చేసినట్లు తెల్సిపోయింది.

టేపు ఆగిపోయిన చాలా సేపటికి మాటలు కూడబలుక్కుంటూ...

చాలా తప్పు చేసినట్లు గద్గదంగా వప్పుకున్నాడు.

వాళ్ళ అమ్మ మీద వొట్టేశాడు. జీవితంలో ఇలాంటి పరిస్థితి రాదని– కాళ్లు పట్టుకుంటానని ప్రయత్నం చేయబోయాడు.

జలజ నిబ్బరంగా ఉంది. మొహమాటంగా సుధాకర్ హాస్పిటల్‌కెళ్దాం రమ్మన్నాడు.

"అవసరం లేదు. మీకూ నాకూ కూడా అనవసరమే. చూడండి. బేచ్‌లర్ లైఫ్‌లో మీరే కాదండీ నేనూ హాయిగా ఉండేదాన్ని మీకన్నా హాయిగా... నాకు చీమకుట్టినా కంగారుపడే అమ్మా, అన్నయ్యా, నాన్నగారూ.. అందరూ ఉండేవారు. నాకోసం టెన్షన్ పడేవాళ్లు. నా కోసం సేక్రిఫైజ్ చేసేవారు.. వాళ్ల కమిట్‌మెంట్‌తో నన్ను ఖుషీగా ఉంచేవారు! నేనూ... బేచ్‌లర్ లైఫ్ వదిలేశాక ఆ ఆనందాలు కోల్పోయానండీ. ఆ రోజుల్లో... నేను ఎవ్వరి గురించి ఆందోళన పడేదాన్ని కాదు. ఇంట్లోకి బైటకీ కాలుకాలినట్లు తిరిగి కళ్లుకాయలు కాసేలా వెయిట్ చేసేదాన్ని కాదు. కానీ బేచ్‌లర్ లైఫ్‌కన్నా నాకు ఈ లైఫే బాగుందండీ. నా అనే మనిషి మీరొక్కరే అనుకున్నాక మీ గురించి ఆపాటి కాన్సంట్రేషన్ దానంతట అదే వస్తుంది. ఆపాటి కమిట్‌మెంట్ అదే ఇస్తుంది" అని చెప్పి భోరున ఏడిచేసింది.

ఆమె కన్నీళ్లతో అతను క్షాళన అయ్యాడు.

ఆమెని కౌగిలించుకుని పునీతుడయ్యాడు.

ఇంకెప్పుడూ అతను తప్పుదారి తొక్కలేదు.

జలజ ఎప్పుడైనా నవ్వుకోడానికిమాత్రం ఆ టేపు పెట్టి సుధాకర్‌ని ఉడికిస్తూంటుంది.